విత్తన ఎంపిక.. దిగుబడి వృద్ధి


సూరప్పగూడెంలో పొలాన్ని దమ్ము చేస్తున్న రైతులు


నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

- సార్వాలో దీర్ఘ కాలిక రకాలే మేలు
- రైతులు సేంద్రియ పద్ధతులు పాటించాలి

మండలం	సాగు విస్తీర్ణం
భీమడోలు	12,734
ఉంగుటూరు	24,043
నిడమర్రు	3450
గణపవరం	12,672

భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో 26 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేస్తున్నారు. భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. పాక్షిక డెల్టా మండలాలైన భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో 60 శాతం కాలువ నీటిపై, 40 శాతం బోర్ల కింద సాగు చేస్తున్నారు. నిడమర్రు, గణపవరం మండలాల్లో పూర్తిగా కాలువ నీటిపై ఆధారపడి రైతులు సాగు చేస్తున్నారు. బోర్ల కింద రైతులు ఇప్పటికే నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. డెల్టా ప్రాంతాల్లో నారుమడులు వేస్తున్నారు. బెంగాలీ కూలీల రాక అలస్యం కావడంతో డెల్టా మండలాల్లో నాట్లు ఆలస్యమవుతున్నాయి. భీమడోలు మండలంలో రైతులు సాగును ప్రారంభించారు. అయితే రైతులు విత్తన ఎంపికలో సూచనలను పాటించి అధిక దిగుబడులు పొందాలంటున్నారు. విత్తు కోసం పంట అనేది నానుడి. అయితే మంచి విత్తనం ఎంపిక చేసుకోవడం ద్వారానే అధిక దిగుబడి సాధించొచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ముంపు ప్రభావం ఉండే ప్రాంతాల్లో స్వర్ణ, పీఎల్ 1100, ఎంటీయూ 1318 రకాలు అనుకూలంగా ఉంటాయి. పలు రకాల భూములు, వాతావరణ పరిస్థితులను తట్టుకొని రెండు పంటలు పండించే ప్రాంతాల్లో మంచి దిగుబడిని నిచ్చే వరి రకం స్వర్ణ. ఇది నత్రజనితో అధిక దిగుబడిని ఇస్తుంది. పంట చేతికి వచ్చే సమయంలో చేలల్లో గింజ మొలకెత్తే స్వభావం తక్కువగా ఉంటుంది. చౌడు భూముల్లో సాగుకు ఇది అనుకూలంగా ఉంటుంది, 160 రోజుల్లో పంట చేతికి వస్తుంది. వర్షాధారం, ఆరుదల ఉన్న ప్రాంతంలో ఎంటీయూ 1318 రకాన్ని సాగు చేసుకోవచ్చు.

విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పురుగు, తెగుళ్లను తట్టుకునే రకాలు ఎంపిక చేసుకోవాలి. గుర్తింపు పొందిన సంస్థలు ధృవీకరించిన విత్తనాలను కొనుగోలు చేయాలి. దళారుల ప్రోద్బలంతో విత్తనాలు కొనుగోలు చేయడం మంచిది కాదు. వ్యవసాయశాఖతో అనుమతి పొందిన డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. బిల్లులను భద్రపరుచుకోవాలి. విత్తనం మొలక శాతం పరీక్షించిన తరువాతే కొనుగోలు చేయాలి. విత్తనాల సంచితో పాటు లాట్ నంబర్, కాల పరిమితిని తప్పనిసరిగా సరి చేసుకోవాలి. విత్తన సంచి, ట్యాగ్, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలి. విత్తన మొలక శాతం 85–90 ఉండాలి. పరీక్షించిన తరువాతే నారుమడులు వేయాలి. సన్న రకాలు ఎంచుకోవడం మంచిది. వాటికి తగిన మార్కెటింగ్, ఎగుమతులు ఉంటాయి. రైతులు సొంతంగా విత్తనాలను తయారు చేసుకుంటే నాణ్యత బాగుంటుంది. విత్తనాలు ఒకే పరిమాణంలోనూ, కలుషితం కాకుండా చూసుకోవాలి. సార్వాకు దీర్ఘకాలిక రకాలు, దాళ్వాకు స్వల్పకాలిక రకాలు అనుకూలం.

విత్తన ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి



రైతులు విత్తనాలు ఎంపికలో వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు పాటించాలి. వ్యవసాయ శాఖ అనుమతి పొందిన దుకాణాల నుంచి వాటిని కొనుగోలు చేసుకోవాలి. పంట పూర్తయ్యే వరకు బిల్లులు భద్రపరుచుకోవాలి. లీటర్ నీటిలో 10 గ్రాముల ట్రైకోడెర్మా విడి పొడిని కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. జులై 15వ తేదీ నాటికి నారుమడులు, ఆగస్టు నెలాఖరుకు నాట్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నాం.

– ఎస్‌పీపీ ఉషారాణి, ఏవో, భీమడోలు

కూటమి నేతల వేధింపులు అమానుషం


డీఎన్నార్‌తో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

దెందులూరు: కూటమి నాయకుల వేధింపులు అమానుషమని వాటిని వెంటనే ఆపాలని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. మండలంలో ప్రత్యేకంగా జోగన్నపాలెం గ్రామంలో కూటమి ప్రభుత్వం, నాయకుల వేధింపులు, దాడులు, అక్రమ కేసులను శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావుకు జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం వివరించారు. సంబంధం లేకపోయినా కక్షపూరితంగా గ్రామాల్లో విషపూరిత వాతావరణం నెలకొల్పేలా కూటమి నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి పరిస్థితిని వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మేకా లక్ష్మణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి, నిట్టా గంగరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

దెందులూరు: మండలంలో శనివారం విద్యుత్ లైన్ల మర్మతుల నిమిత్తం జోగన్నపాలెం, గుడిగుంట, అక్కిరెడ్డిగూడెం, కొప్పులవారిగూడెం, సీతాపురం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేడ్కర్ తెలిపారు. కావున వినియోగదారులు సహకరించవలసినదిగా అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు కోరారు.

క్లుప్తంగా

బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శికి అభినందనలు


సూర్యనారాయణను అభినందిస్తున్న ఎమ్మెల్సీలు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ముదుగురు సూర్యనారాయణను శుక్రవారం కొండలరావుపాలెంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్సీ వంకర రవీంద్రనాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అభినందించారు. పార్టీ లక్ష్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ బలోపేతానికి బీసీ సంఘాలను సమన్వయం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

ఆధునికీకరణ పనులు వేగవంతం


వేగవంతంగా చేస్తున్న నిర్మాణ పనులు

సాక్షి స్పందన

ఉంగుటూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయని శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు స్పందించారు. దీంతో శుక్రవారం ఆధునికీకరణ పనులు, సుందరీకరణ పనులు వేగవంతం చేశారు. ఎంపీడీవో ఆఫీసు ముందు పిల్లర్లు రెండు వైపులా నిర్మించారు. పిట్టగోడలు నిర్మిస్తున్నారు. ఎంపీడీవో మనోజు మాట్లాడుతూ ఇక పనులు ఆగవని వేగవంతంగా చేస్తామని వివరించారు. పీఆర్ ఏఈ కృష్ణమోహన్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

వివేకానందుని బోధనలు ఆచరించాలి

భీమడోలు: స్వామి వివేకానందుని బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు మద్దాల అప్పారావు అన్నారు. భీమడోలులో వైఎస్సార్ సీపీ నాయకులు సుతాపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వివేకానందుని వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివేకానందుని విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.

పాఠశాలకు కుర్చీల బహూకరణ

ఉంగుటూరు: పని చేసిన పాఠశాలకు రూ.5 వేల విలువైన కుర్చీలను ఉపాధ్యాయుడు అందజేశారు. నారాయణపురం హైస్కూలులో చిన్ని సురేంద్ర ఎనిమిది సంవత్సరాలు పని చేశారు. అనంతరం హెచ్‌ఎం పదోన్నతిపై రాచూరు హైస్కూలుకు వెళ్లారు. ఖాళీ జరిగింది. ఈ నేపథ్యంలో పని చేసిన పాఠశాలకు కుర్చీలను అందజేశారు.

నాణ్యమైన విద్యను అందించాలి

పెదపాడు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని పెదపాడు మండల విద్యాశాఖాధికారి సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు. పెదపాడు మండలంలోని రాజుపేటలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువుల స్థాయిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వారికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయ ఆకస్మిక తనిఖీ

ఉంగుటూరు: విధి నిర్వహణలో సచివాలయ ఉద్యోగులు అలసత్వం వహించరాదని ఎంపీడీవో రాజ్‌మనోజు సూచించారు. శుక్రవారం వెల్లమిల్లి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారికి సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

గణపవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల చదువుకోసం దాతలు, స్వచ్ఛంద సంస్థలు చేయూత ఇవ్వాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నడింపల్లి సోమరాజు అన్నారు. శుక్రవారం గణపవరంలోని జగన్నాథపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు రూ.12వేల విలువైన నోటు పుస్తకాలు ఇతర విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు వి.సుబ్బరాజు, కె.రంగరాజు, వి.ప్రసాదరాజు, వి.శ్రీనివాసరాజు, ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సంపూర్ణ ఆరోగ్యం

భీమడోలు: కీటక జనిత వ్యాధులను సమష్టి కృషితో నివారణ సాధ్యమని పూళ్ల పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో వైవీ లక్ష్మణరావు అన్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని రెడ్డినాయుడుపేట ఏరియాలో శుక్రవారం ఫ్రైడే. డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీలో యువత జోష్


దెందులూరు: కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి


ఉంగుటూరు: సమావేశానికి తరలి వెళుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

- కొండలరావుపాలెంలో జిల్లాస్థాయి సమావేశం
- జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులు

దెందులూరు: నియోజకవర్గంలోని పెదవేగి మండలం కొండలరావుపాలెంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి వచ్చారు. యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నానితో పాటు పార్టీ శ్రేణుల రాకతో వైఎస్సార్‌సీపీ ప్రత్యేక జోష్‌ను నింపారు. ఇటీవల ఏలూరులో నిర్వహించిన యువతపోరు విజయవంతం కావడం, రెండు వారాల్లో దెందులూరు నియోజకవర్గ సమావేశం విజయవంతమవడం శుభపరిణామమని నాయకులు అన్నారు. అతిథులకు క్రేయిన్లతో గజమాలను స్వాగత ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ నిజమైందని ఎన్నికల ముందు అమలు చేయలేని హామీలిచ్చి ప్రజలను అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, వేధింపులు కూటమి ప్రభుత్వ లక్ష్యంగా మారిందన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేకా లక్ష్మణరావు, యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీలు నిట్టా లీలా నవకాంతం, రమేష్, ఎంపీపీలు తాతా రమ్యశ్రీ, బత్తుల రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు ముంగర సంజీవ్ కుమార్, వేమూరి జితేంద్ర కుమార్, అప్పన పద్మావతి, పోకల రాంబాబు, తొత్తడి వేద కుమారి, పాలడుగు సత్యనారాయణ, ముదుగురు సూర్యనారాయణ, అప్పన ప్రసాద్, కట్టా ఏసుబాబు, ఆళ్ల సతీష్ చౌదరి, డీబీఆర్‌కే చౌదరి, మండలి కొండలరావు, ప్రభాకరరావు, పళ్లెం ప్రసాద్, సొంగా సందీప్, తేరా ఆనంద్, జానంపేట ప్రసాదబాబు, అప్పనప్రసాద్, ఛండీ ప్రియ, చల్లా మేరీరాజు, సురేష్ పాల్గొన్నారు.


దెందులూరు: మీటింగ్‌కు పయనమైన యువత


దెందులూరు: రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టోను ఆవిష్కరిస్తున్న మహిళా నేతలు

ఉంగుటూరు నుంచి తరలిన కార్యకర్తలు

ఉంగుటూరు: పెదవేగి మండలం పెదలింగరాయుడు గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి ఉంగుటూరు మండలం నుంచి పార్టీ కార్యకర్తలు నాయకులు శుక్రవారం తరలి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ పుప్పాల వాసుబాబు పిలుపు మేరకు మండల కన్వీనర్ మరడ మంగరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. వైఎస్సార్ సీపీ నాయకులు యెలిశెట్టి పాపారావు బాబ్జి, పుప్పాల గోపి, కొరిపల్లి శ్రీను, బండారు నాగరాజు, విష్ణుమూర్తి, దొంతంశెట్టి సత్యనారాయణ, గాది రమణ, తమ్మిన శ్రీను, మలకలపల్లి నాగు, లక్ష్మీనారాయణ, సుబ్బారెడ్డి, లక్ష్మణరావు తరలివెళ్లారు.

వంగవీటి రంగాకు ఘన నివాళి


రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, తదితరులు

భీమడోలు: వంగవీటి మోహన రంగా జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, రాష్ట్ర ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలు సంత మార్కెట్ వద్ద శుక్రవారం వంగవీటి మోహనరంగా అభిమానుల సంఘం ఆధ్వర్యంలో మోహన రంగా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీలకతీతంగా భారీ సంఖ్యలో అభిమానులు తరలి వచ్చారు. రంగా విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో గన్ని నాగ గోపాలరావు, భీమరాజు, కందులపాటి శ్రీనివాస్, పసుపులేటి సత్యనారాయణ, పసుపులేటి శ్రీను, మద్దుల రాజా, ఇంజేటి నీలిమ, ప్రత్తి మదన్, రామకుర్తి నాగేశ్వరరావు, తుమ్మగుంట రంగ, మద్దాల అప్పారావు, ముప్పిరి శెట్టి సుబ్రహ్మణ్యం, గంటా శ్రీనివాసరావు, సుతాపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలి


ఉంగుటూరు: కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో–2 వెంకట్రావు


భీమడోలు: సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం జీకేడీ సునీత

ఉంగుటూరు: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఈ నెల 15 వరకు నిర్వహించాల్సి ఉంది. మండల విద్యాశాఖాధికారి–2 వెంకట్రావు గోపినాథపట్నంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని, అంగన్‌వాడీ కేంద్రాల్లో 5 సంవత్సరాలు నిండిన వారు పాఠశాలల్లో చేరుతున్నారో లేదోనని ఆరా తీశారు. తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. ఇందులో భాగంగానే 10వ తేదీన మెగా తల్లితండ్రుల సమావేశం పాఠశాలల్లో నిర్వహించాల్సి ఉందని ఆయన వివరించారు.

డ్రాపవుట్స్ లేకుండా చూడాలి

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపవుట్స్ లేకుండా చూడాల్సిన బాధ్యత హెచ్‌ఎంలదేనని గుండుగొలను హెచ్‌ఎం జీకేడీ సునీత అన్నారు. గుండుగొలను, భీమడోలు, పూళ్ల ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం సాయంత్రం క్లస్టర్ సమావేశాలు నిర్వహించారు. గుండుగొలను ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం జీకేడీ సునీత మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు. లేని పక్షంలో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గి బడులు నిర్వీర్యమయ్యే అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమాల్లో హెచ్‌ఎం పి.శేష పద్మజ, పెనుగొండ భువనేశ్వరరావు, హెచ్‌ఎంలు పాశం పాండురంగారావు, ఎం.సుధాకర్, కృష్ణప్రియ, సీఆర్‌ఎంటీ సీహెచ్‌వీ రమణ, ఎం.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

భీమడోలు: మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో విద్యార్థులకు అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న విద్యా విషయాలపై ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిశుభ్రత, ఎండీఎం నాణ్యత, బోధనా ప్రమాణాలతో పాటు శుక్రవారం జరిగే ఆరోగ్య శిబిరాలలపై నమోదు చేసిన రిజిస్టర్లు తదితర అంశాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఎండీఎం నిర్వాహకులు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థినులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

దెందులూరు: కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం దెందులూరులో సీఐటీయూ నాయకులు కామేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు లింగరాజు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం స్వాతంత్ర్యానికి ముందు కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికులను బానిసలుగా మారుస్తుందన్నారు. ఐక్యంగా జులై 9 జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆదర్శనీయుడు.. మన్యం వీరుడు


నిడమర్రు: అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నేతలు


దెందులూరు: అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన తహసీల్దార్


గణపవరం: అల్లూరికి నివాళులర్పిస్తున్న నేతలు

నిడమర్రు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నేటి తరం యువతకు ఆదర్శమని అల్లూరి జిల్లా సంక్షేమ సంఘం అధ్యక్షులు సాగిరాజు జానకిరామరాజు అన్నారు. శుక్రవారం పత్తేపురం గ్రామంలో మంచి నీటి చెరువు వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఆ సంఘ సభ్యులు పూలమాలలతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పత్సమట్ల లచ్చిరాజు, వేగేశ్న సుబ్బరాజు, రుద్రరాజు బంగార్రాజు, ఆర్.గాంధీ, మంత్రబుద్ధి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి త్యాగం యువతకు స్ఫూర్తి

దెందులూరు: బ్రిటిష్ పాలకులను దేశం నుంచి పారద్రోలిన గొప్ప యోధుడు అల్లూరి సీతారామరాజు పోరాట పటిమ యువతకు స్ఫూర్తిదాయకమని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శుక్రవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలునిర్వహించారు. సీతారామరాజు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమ్లో డిప్యూటీ తహశీల్దార్ కృష్ణంరాజు, ఆర్ఐ హేమమాలిని, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

అల్లూరికి భారతరత్న ఇవ్వాలి

గణపవరం: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుకు భారతరత్న ఇవ్వాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నడింపల్లి సోమరాజు, అఖిల భారత హేండ్‌లూమ్స్ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు, పలువురు నాయకులు కోరారు. శుక్రవారం అల్లూరి జయంతి సందర్భంగా మండలంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణపవరం దండు మారెమ్మ ఆలయం వద్ద అఖిలపక్ష నాయకులు అల్లూరికి నివాళులర్పించారు. మండల వ్యాప్తంగా పలుచోట్ల అల్లూరి జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి రంగరాజు, వేగేశ్న సుబ్బరాజు, వేగేశ్న ప్రసాదరాజు, వేగేశ్న శ్రీనివాసరాజు చిన్నం నాగేశ్వరరావు, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.